ఈ స్వతంత్ర భారతంలో కళ్ళు విప్పిన సామాన్య స్త్రీని నేను. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ళకు కూడా అనేక సంకెళ్ళలో బంధింపబడిన స్త్రీ జాతికి ప్రతినిధిని నేను. సంకెళ్ళను ఛేదించుకుని స్వేచ్ఛగా, సంతోషంగా బ్రతకాలనే చైతన్యం, అన్యాయాల్ని ప్రతిఫలించే తెగువ వుండి కూడా నిస్సహాయంగా ఓడిపోతున్న కొద్ది మంది అభాగినులకు కూడా నేను ప్రతినిధిని.



ఈ నిష్ఠుర ప్రపంచంలోకి వచ్చి నాలుగు రోజులైనా కాకముందే నా ఒడిలో మృత్యువుతో పోరాడుతున్న ఈ పసి కందును చూస్తుంటే నా ఓటమి నగ్నంగా నా ముందు నృత్యం చేస్తున్నట్టుంది. కనుగ్రుడ్లు పైకి పోయి, మెడ బిగిసిపోయి, అవిరామంగా కాళ్ళూ, చేతులూ కొట్టుకుంటున్న నా చిన్నారి బాబును చూస్తూ నా ప్రాణం కడగట్టిపోతూంది. ఫిట్ వచ్చిన ప్రతిసారీ వికృతంగా మారిపోతున్న నావరాల పంటను చూస్తుంటే నా హృదయం పగిలిపోతూంది. ఇది కరడుగట్టిన మూర్ఖత్వానికి, నిస్పృహాయుతకూ, నిర్లక్ష్యానికి ప్రతిఫలమనే ఆలోచన రాగానే

# బాబూ నన్ను క్షమించు!

—డాక్టర్ ఆలూరి విజయ లక్ష్మి

ఆవేశంతో, ఆవేదనతో నా మెదడులోని నరాలు చిట్లిపోతున్నాయి. చెదిరిపోతున్న నా జీవన స్వప్నం నన్ను కదిపి కుదిపేస్తోంది. నా జీవితమంతా పదే పదే నా కళ్ళ ముందు నిలుస్తోంది.

ఆకు కదిలితే, పావురాయి ఎగిరితే పరవశంతో పలవరించే నేను ఊహ తెలిసి, ఆలోచన పెరిగే వయసొచ్చేసరికి వాస్తవ జీవితాన్ని అర్థం చేసుకోసాగాను. మగపిల్లాడి కోసం చూసే క్రమంలో వరసగా పుట్టిన ఐదుగురు ఆడపిల్లల్లో నేను నాలుగవదాన్ని. నా తరువాత నాలుగేళ్ళకు పుట్టిన తమ్ముడు రాజా అంటే యింట్లో అందరికీ ఎంత అపురూపమో వాళ్ళకు ఆశాభంగం కలిగిస్తూ పుట్టిన ఆడపిల్లలంటే అంత చీదరింపని తెలిసొచ్చింది.

"నా రెక్కల కష్టమంతా ఈ ఆడ సంత తిండికీ, తలమానెకే సరిపోతుంది." అని వాపోయేవాడు నాన్న.

"ఈ మందంతా కడతేరేప్పటికి నా కొడుక్కేం మిగులుతుంది చేతికి చిప్ప తప్ప" అని ముక్కు చీదేసేది అమ్మ.

ఆకలే తప్ప ఆత్మాభిమానం తెలియని ఆ వయసులో మమ్మల్ని ఆర్థాకలితో మాడుస్తూ తమ్ముడికి అవీ, యివీ కొని పెడుతూంటే ఉక్రోషంతో ఏడ్చేదాన్ని. ఏడ్చిన కొద్దీ ఆకలితో పాటు తన్నులు కూడా తోడయేవి.

ఆడ పిల్లగా పుట్టి నేనేదో మహాపరాధం చేసినట్టు వీళ్ళిలా తిడతారెందుకు? మగ పిల్లాడి కోసం చూస్తూ యింతమంది ఆడ పిల్లల్ని కనడం వీళ్ళ మూర్ఖత్వం. తమ మూర్ఖత్వానికి సిగ్గుపడాల్సిందిపోయి కన్న బిడ్డలనే మమకారం కూడా లేకుండా మమ్మల్ని ఛీత్కరించుకుంటూంటే మూగ మొద్దులా పడి వుండడం నా వల్ల యేది కాదు. ఎదురు తిరిగి మాట్లాడి మళ్ళీ దెబ్బలు తినేదాన్ని.

"ఎందుకే రాజాని చూసి అలా ఏడుస్తావు? వాడికీ నీకూ పోలికేమిటి? వాడు మగబిడ్డ" అనే అమ్మను చూసి నా హృదయం క్రుంగిపోయేది. ఎంత దురదృష్టవంతులం మేమేనా కన్నబిడ్డల్నందరినీ కనురెప్పల్లా సాకవలసిన తల్లి అనవలసిన మాటేనా యిది?!

ఆకలి, ఉక్రోషం, ఆవేశంతో పాటు చదువుకోవాలనే ప్రగాఢమైన కోరిక కూడా నా హృదయంలో బలపడసాగింది. అంత స్పష్టంగా ఆలోచించే వయసు కాకపోయినా చదువుకుని పెద్ద ఉద్యోగాన్ని సంపాదించుకోవడం ద్వారా ఆడ దాన్నని నన్నీ రోజు చులకన చేస్తున్న వాళ్ళందరికీ బుద్ధి చెప్పాలనే కసి బహుశా నాలో అంతర్లీనంగా వుండి వుంటుంది.

ఐదవ తరగతి పాసయే వరకు పెద్ద ఆటంకమేమీ లేకుండానే గడిచిపోయింది. తరువాత చదువుకు మా ఊళ్ళో హైస్కూలు లేదు. ఐదు మైళ్ల దూరంలో వున్న పై ఉర్లోని స్కూలుకు వెళ్లి ఆడపిల్ల చదువుకోవడం మహా నేరమన్నట్టు అడ్డుపడ్డారు మా వాళ్ళు.

"చదువుకుని ఊళ్ళేలతావా? పేడ పిసుక్కోవడానికి, అంట్ల గిన్నెలు తోముకోవడానికి అసలు చదువే అనవసరం" నాన్న దులపరించారు. అంట్ల గిన్నెలు తోముకోవడానికి, పేడ పిసుక్కోవడానికి తప్ప ఒక విశిష్టమైన పనిని చెయ్యగల శక్తి నాకు లేదని వాళ్ళు అంచనా వేస్తున్నందుకు నాకు రోషమొచ్చింది.


"ఆడ పిల్ల మగరాయుడిలా తగుదునమ్మా అని పై ఊళ్ళకెళ్ళి చదవడమా? ఊళ్ళో ఏ పిల్లయినా అట్లా వెళ్ళి చదువుతోందా? ఏ అనర్థమైనా జరిగితే యిక నాకు ఏ మయ్యో, గొయ్యో గతే" అంటున్న అమ్మను చూస్తే నాకు కోపం లేదు జాలేసింది. దుఃఖం వచ్చింది. నాన్న అభీష్టానికి వ్యతిరేకంగా మాట్లాడి బ్రతకలేని అశక్తతతో అమ్మ ఇలా మాట్లాడుతుందే తప్ప నా మీద ప్రేమ, మమకారం లేక కాదు అని నన్ను నేను ఊరడించుకోవడానికి ప్రయత్నించాను. రాజాకి పెద్ద చదువులు చెప్పించడానికి, వాడిని గొప్ప హోదాలో చూడడానికి వాళ్ళు కంటున్న కలలు, వేసుకుంటున్న ప్రణాళికలు నాకు తెలుసు. వాడు చదువుకుని ఉద్యోగాలు చేసి, ఊళ్ళేలగలిగినప్పుడు నేనెందుకు చెయ్యలేను నా పని?! ఈ ఊరి మగపిల్లలెందరో అదే హైస్కూలుకు వెళ్ళి చదువుకుంటున్నారు. వాళ్ల వల్ల జరగని అనర్థం నా వల్ల ఎందుకు జరుగుతుంది? ఎన్నో ఊళ్ళల్లో ఎంతో మంది ఆడ పిల్లలు బయటి ఊళ్ళ కెళ్ళి చదువుకుంటున్నారు. వాళ్ల వల్ల అనర్థాలు జరిగిపోతుంటే వాళ్ళ తల్లులు నూతుల్లో, గోతుల్లో పడుతున్నారా? లేదే. మరెందుకు వీళ్ళిలా నా కాళ్ళకు సంకెళ్ళు వేయడానికి శతవిధాలా ప్రయత్నించారు. హైస్కూల్లో చేర్చదాకా అన్నం ముట్టనని మొండికెత్తాను." ఇంట్లో మీరు చెయ్యమన్న పనులన్నీ చేసి స్కూలుకు వెళ్తాను ఒక పూట అన్నం మానేసి పుస్తకాలు కొనుకుంటాను. మీకు తలవంపు లయ్యే పరిస్థితి నా వల్ల రాదు. నన్ను చదువుకోనివ్వండి" అని అమ్మను ప్రాధేయపడ్డాను.

"నేను బ్రతకడమెంత ముఖ్యమో చదువుకోవడమూ అంతే ముఖ్యం. నాకు బ్రతకడానికెంత హక్కుందో చదువుకోవడానికీ అంతే హక్కుంది. నేను చదువుకుంటాను." అని వాదించాను. మా స్కూలు హెడ్ మాస్టారి దగ్గరనాగోడు వెళ్ళబోసుకున్నాను.

"అమ్మాయి చాలా తెలివయింది. ఆ పిల్ల ఉత్సాహాన్ని చంపకండి రోజుకు పది మైళ్ళు నడిచి వెళ్ళి చదువుకుంటానంటూందంటే చదువుకోవాలనే కోరిక ఎంత బలంగా వుందో ఆలోచించండి. పెద్దగా ఖర్చేమీ అవ్వదు. అమ్మాయికి స్కాలర్ షిప్ కోసం ప్రయత్నించవచ్చు. నా మాట కాదనకండి" మాస్టారు వచ్చి చెప్పాక మెత్తపడ్డారు. మళ్ళీ రెండు మూడుసార్లు సేచీ పెట్టాక నేను చదువుకోవడానికి ఒప్పుకున్నారు.

హైస్కూల్లో చేరిన రోజున నా ఆనందానికి అవధుల్లేవు. రెక్కలు విప్పుకుని ఆకాశంలో తేలిపోతున్నట్లనిపించింది. చదువు నాలో క్రొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆకలిని, అలసటను మరిపించింది. నా సంకెళ్ళను ఛేదించగల సాధనమేదో ఈ చదువులో వున్నట్లనిపించింది.

మా హైస్కూలు లైబ్రరీలో దేశ, విదేశ సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న పుస్తకాలు అనేకం వున్నాయి. ఆ పుస్తకాన్ని



## గట్టిపట్టు!

దక్షిణాది నుంచి హిందీ సీమకి వెళ్ళిన ప్రతి హీరోయిన్ అక్కడా 'టాప్'కి వెళ్ళిపోయింది. అయితే దక్షిణాది నుంచి అక్కడ అడుగుపెట్టిన ప్రతి హీరో నిలదొక్కుకోలేకపోయాడు. ఒక్క కమలహాసన్ మటుకు కొంతలో కొంత నెట్టుకు రాగలిగాడు.

"ఏక్ దూజ్ కేలియే', 'సాగర్' చిత్రాలలో అద్భుతమైన నటన ప్రదర్శించినా బొంబాయి కమల్‌కి అడ్డుగోడే కట్టింది. తెలుగు, తమిళ చిత్రాలలో తన ఏకాగ్రత నిలపడంవలన హిందీ చిత్రాల గురించి కమల్ అంతగా పట్టించుకోలేదు. లేకపోతే ఆ అడ్డు గోడ మీద నుంచి ఎప్పుడో హైజంప్ చేసేవాడు.

ప్రస్తుతం తన 'తడాఖా' చూపించడానికి తన కుమార్తె శృతి పేరు మీద స్థాపించిన 'శృతి ఎంటర్ ప్రైజెస్' బ్యానర్‌తో హిందీ చిత్రం ప్రారంభించడానికి కమల్ సిద్ధంగా వున్నాడు. ఈలోపున మరుగుజ్జ పాత్రతో మూడు వేషాలు ధరించిన 'విచిత్ర సోదరులు' చిత్రాన్ని హిందీలోకి డబ్ చేసి విడుదల చేస్తానంటున్నాడు కమల్. కమల్‌ది 'గట్టిపట్టు' అంటారు అందుకే!

— 'బంటి'

---

"రాణీ! నీ కోసం నేనేమైనా చేస్తా!"

"ఏం చెయ్యక్కర్లేదు కాని నీవు వెళ్ళేప్పుడు దారిలో నేణూతో నీ కోసం రాణీ పార్కులో ఎదురుచూస్తుందని చెప్పు!"


—ఎస్.ఎస్.ఆర్.

(పొన్నూరు)

పూర్తిగా అర్థం చేసుకోగల వయసు కాదు నాది. కానీ పుస్తకాలు చదవడమనే పిచ్చి నా అణువణువులో నిండిపోయింది. నాలో ఏదో తాదాత్మ్యత, నిర్వచించ లేని అనుభూతి, అలజడి, ఆలోచన, నేనిప్పుడున్న స్థితి నుండి బయటపడి పరిపూర్ణమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో బ్రతకాలనే తపన - ఇవన్నీ కలగాపులగమై నేనో క్రొత్త ప్రపంచంలో బ్రతుకుతున్నట్లనిపించేది.

మోకాలిలోతు బురదలో కాలు వేస్తే తియ్యడానికి అతి ప్రయాసపడి ఏ క్షణంలోనయినా జర్రున జారిపడతామనే భయంతో నడవవలసి వచ్చే మట్టి రోడ్డు, పొలం గట్లు ఎగిరి దాటవలసిన పంట కాలువలు కాలిలో గుచ్చుకున్న దిగే తుమ్మ ముళ్ళు...... ఇవేవీ బాధాకరంగా అనిపించేవి కావు. ఒక మంచి పుస్తకం చదివిన రోజున ఎనలేని ఆనందం, ఒక కొత్త విషయాన్ని తెలుసుకున్న రోజున ప్రపంచాన్ని జయించినంత ఉద్వేగం సుగంధపరిమళంలా నన్నలుముకోసాగాయి.

భవిష్యత్తు మీద ఎన్నో ఆశలతో సుందర స్వప్నాలు కంటున్న నేను వాస్తవంలోకి వచ్చేసరికి ఎన్నో అనూహ్యమైన సంఘటనలు




జరిగిపోయాయి. నేను వ్యక్తురాలయిన దగ్గర్నుండి నన్నింక చదువాపేయమని ఇంట్లో గొడవ చేయసాగారు. వాళ్ల గొడవకు లొంగకుండా నేను మొండిగా స్కూలుకు వెళ్తానే వున్నాను. అంతలో అకస్మాత్తుగా నాన్న ట్రాక్టర్ క్రిందపడి చనిపోయారు. దాంతో మా కుటుంబ పరిస్థితి మరీ దిగజారింది. వున్న కాస్త పొలం అక్కల పెళ్ళిళ్ల ఖర్చుకు కరిగిపోయింది. నాన్న వున్నంత సేపు కొంత గుట్టుగా వున్న మా కుటుంబం ఆయన పోగానే వీధిన పడినట్లయింది. దిక్కుతోచక దీనంగా ఏడుస్తున్న అమ్మతో నేనింకా చదువును కొనసాగిస్తాననే ధైర్యం చెయ్యలేక పోయాను. అసలు నేను చదువుకోవడానికి వేరే ఏదైనా ఉపాయము ఉందా అనేది కూడా నాకు తోచలేదు. ఎవరిని సంప్రదించాలో ఎవరి సహకారాన్ని అర్థించాలో తెలియలేదు. అలాంటి అనిశ్చిత పరిస్థితిలో నేను చదువును ఆపేయక తప్పలేదు. తీరని దాహంతో పుస్తకాన్ని చదువుతున్న అననుకూల పరిస్థితుల్ని చూసి భయపడి పిరికిపందలా లొంగిపోయాను. తన నెత్తిమీద వచ్చి పడిన బాధ్యతను వదిలించుకోవడానికి మామయ్య తెచ్చిన వ్యక్తి ముందు తల వంచి తాళి కట్టించుకుని అమ్మ దుఃఖాన్ని తగ్గించాను.

కళ్లలయిన నా కలల్ని చెరిపేసుకుని, నన్ను చుట్టేస్తున్న తీవ్రమైన నిరాశకు లొంగకుండా వుండడానికి ప్రయత్నిస్తూ అత్తవారింట్లో అడుగు పెట్టాను. కానీ నన్నింకా నిరాశలో ముంచేస్తూ అక్కడా అదే దారిద్ర్యం, అవే ఆర్థిక సమస్యలు, అవే సంకుచిత మనస్తత్వాలు.

అతివృష్టి, అనావృష్టి మూలంగా వరుసగా మూడు, నాలుగు సంవత్సరాల పంటలు దెబ్బతిన్నాయి. పొలానికి పెట్టుబడి పెట్ట డానికి తెచ్చిన అప్పులు తీరే మార్గం లేక, పాపంలా పెరుగుతున్న అప్పుల్ని చూసి గుండె బేజారెత్తి పొలాన్ని అమ్మి అప్పుల్ని తీర్చేశారు. గత్యంతరం లేక ఇతరుల పొలాల్లో కూలీలుగా పనిచేస్తున్నారు నా భర్త, బావగారు. పెళ్ళి కెదిగిన ఆడబడుచు లిద్దరు కట్నాల మార్కెట్లో భర్తల్ని కొనుక్కోలేక, చదువు సంధ్యలు లేక ఇంట్లోనే మగ్గుతున్నారు. తోడికోడలు వ్యవధి లేకుండా పుట్టిన నలుగురు పిల్లల్తో సతమతమయ్యేది. అనా రోగ్యంతో కొంత ఆస్తి నష్టపోయిందనే మనోవ్యధతో కొంత మంచం పట్టారు మామగారు. తనలోని అసంతృప్తిని, విచారాన్ని ఇంట్లో వాళ్ళందరిని తిట్టడం ద్వారా వెల్లడించుతుంది అత్తగారు.

ఇద్దరి సంపాదన పది మంది తినాల్సిరావడంతో ప్రతీ దానికి వెదుకులాటే అయేది. ఒక పుస్తకంగానీ, పేపర్ గాని కొనుక్కునే తాహతు లేదు. ఆ మారుమూల పల్లెటూళ్ళో లైబ్రరీ లేదు. సూర్యుడు ఉదయించక ముందు నుండి ప్రొద్దు వాలిపోయేదాకా నిరర్థకమైన ఏవో చిన్న చిన్న పనులు చేస్తూ అత్తగారి దూషణలు వినడం దిన చర్య అయింది. ఆ విధంగా కొద్ది రోజులు గడిచేసరికి అంత నిర్జీవమయిన బ్రతుకులో నాకు ఊపిరాడనట్లయింది. ఎవరికీ ఏ ఉపయోగం లేకుండా వున్న నేను తినే తిండి కూడా నాకు వృధా వ్యయంగా తోచేది. అలా ఎంతోకాలం బ్రతక లేకపోయాను. నేను చదువుకునే మార్గం ఎలాగూ మూసుకు పోయింది. కనీసం ఉత్పత్తి విలువలు గల, నాకు ఆత్మసంతృప్తి నివ్వగల పనన్నా చెయ్యాలి. నాకు అవకాశంలో వున్న పని నా భర్తతో పాటు పొలానికి వెళ్ళి వ్యవసాయపు పనుల్లో పాల్గొనడమే.

నా ప్రతిపాదన విని నా భర్త నన్నొక పిచ్చిదానిని చూసినట్టు చూశారు. "మన ఇళ్ళలో ఆడవాళ్ళు పొలాల్లోకి పనులకు వెళ్ళడమనేది ఇంతవరకు జరగలేదు. ఇంట్లో మగవాళ్ళం ఇంకా బ్రతికే వున్నాం ఇప్పుడట్లాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోమాకు" దురుసుగా నన్ను హెచ్చరించారాయన.

కష్టపడి పనిచేసి సంపాదించుకుని తినడానికి నామోషీ పడ నక్కరలేదు. ఒంట్లో ఆరోగ్యం, శక్తి వున్న నేను, నా ఆడ పడుచులు, తోడి కోడలు కూడా నా భర్త, బావగారితో పాటు శ్రమించి సంపాదించినట్లయితే మాయింటి పరిస్థితి ఇంత దయనీయంగా వుండదు! బాధలే తప్ప బాల్యంలోని మధురిమను పొందని నేను మాతో పాటు బ్రతుకుతున్న నలుగురు పసివాళ్ళు వ్యధల పీడ కలల బారిన పడకుండా రక్షించడాన్ని నా కర్తవ్యంగా భావించాను. శ్రమించడంలో గౌరవం, ఆనందం అనుభవించడం తెలిసినట్లయితే మా ఆడబడుచులు అందుబాటులో లేని వరుల కోసం కాచుకు కూర్చుని జీవితాన్ని నిష్ఫలం చేసుకోకుండా మరో శ్రమ జీవి తోడును అంగీకరించగలుగుతారు.

నా వాదాన్ని విని నన్నో ప్రమాదకరమైన వ్యక్తిని చూసినట్టు చూశారంతా. "ఆడపిల్లల్ని పెళ్ళిళ్ళు చేసి అత్తారింటికి పంపా ల్సిందిపోయి పొలాల్లోకి పంపి పని చేయించే గ్రహచారం నా నొసటన రాసి వుందా!" అంటూ గొల్లుమంది మా అత్తగారు. 'నేను బ్రతికుండగా ఇలాంటి పరువు తక్కువ పనులు చెయ్యనివ్వను"



# అదే ట్రాక్!

"నన్ను అర్థం చేసుకునే వ్యక్తి, నేను సినిమాలలో నటించడానికి అనుమతించే వ్యక్తి భర్త కావాలని నేను కోరుకుంటున్నాను" అంటుంది పెళ్ళికాని ప్రతి హీరోయిన్.

ఇప్పుడు అదే 'ట్రాక్' మీద పరిగెత్తుతోంది పరుగుల రాణి పి.టి. ఉష. ఒలింపిక్ కాంస్య పతకాన్ని కొద్దిలో పోగొట్టుకున్నా, ఆసియా క్రీడోత్సవాలలోను, అనేక అంతర్జాతీయ పోటీలలోనూ భారత దేశానికి బంగారు పంట పండించిన ఉషకి త్వరలో పెళ్ళి చేద్దామని ఆమె కుటుంబంలో పెద్దలు అనుకుంటు న్నారు. అయితే బీజింగ్‌లో ఈ సంవత్సరం జరిగే ఆసియా క్రీడోత్సవం దాకా నిశ్చయంగా ఉషకి వివాహం జరగకపోవచ్చు. ప్రస్తుతం 'దేశభక్తి' ముఖ్యమని, ఆ దేశభక్తితోనే బీజింగ్‌లో మాతృదేశానికి స్వర్ణపతకం ఒకటయినా తెస్తానని ఉష చెప్తోంది.

"నాకు కాబోయే భర్త క్రీడాభిమాని కావాలి. అప్పుడే అతను నన్ను అర్థం చేసుకోగలడు..." అంటోంది ఉష. పెళ్ళి తర్వాతా పరిగెత్తాలని ఆమె అభిమతం కదా!

— 'బంటి'

కటువుగా చెప్పారు మామగారు.

ఆ యింట్లో వుంటూ బయటికి వెళ్ళి పనిచేయడం అసంభవమనే విషయం తేలిపోయింది. యిప్పుడేం చెయ్యాలి? అదే గానుగెద్దు జీవితాన్ని గడిపెయ్యడమా నేను గౌరవంగా తలుస్తున్న జీవితం కోసం, నా సంతోషం కోసం అందర్నీ ధిక్కరించడమా? నాకు నా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ఆత్మగౌరవం ముఖ్యమా, లేక కుటుంబం యిస్తున్న భద్రత ముఖ్యమా? చదువుకుని, ఉద్యోగం చేస్తూ సంపాదించుకుంటున్న స్త్రీలు, ఆస్తిపాస్తులున్న స్త్రీలే యిలాంటి స్థితిలో మనసు చంపుకుని, రాజీ పడిపోయి భద్రత వైపు మొగ్గు చూపుతున్నారు. ఎటూ, ఏ దారీ లేని నేనెలా ఒంటరిగా పోరాడగలను? ఈ సంఘర్షణలో నేను నలి బిలి అయిపోతూండగా నేను తల్లిని కాబోతున్న సూచనలు కనిపించాయి. ఈ సూచనల్ని గుర్తించిన వెంటనే ఒకప్పుడు నేను నా బిడ్డను గురించి కన్న కలలు కళ్ల ముందు నిలిచాయి. నేనో అందమైన, ఆరోగ్యవంతమైన పాపాయిని కనాలని, నా బిడ్డను చీదరింపులు, ఛీత్కారాలు, అవమానాలంటే తెలియకుండా పెంచాలని, జీవితంలో నేను పొందలేనివన్నీ నా బిడ్డకు అందించాలని... కానీ ఈ కలలు యదార్థమయ్యే అవకాశం లేనే లేదని గ్రహించగానే తీవ్రమైన నిరాశా నిస్పృహలు నన్నావరించాయి. ఆరోగ్యంగా పెరగడానికి కావలసిన తిండైనా పెట్టలేని నాకు ఒక బిడ్డకు తల్లినయ్యే అర్హత వుందా? ఏ చిన్ని లక్ష్యాన్నీ సాధించలేని నేను, నా బిడ్డకు మంచి జీవితాన్నెలా అందించగలుగుతాను?

నేనీ ఆలోచనలతో సతమతమవుతుండగానే ఆరో నెల వచ్చింది. బిడ్డ కదలికలు నా హృదయాన్ని మథించడం మొదలు పెట్టాయి. నాలోని నిరాశను, నిర్లిప్తతను చెదరగొట్టసాగాయి.

ఒకసారి లేడీ డాక్టరుకు చూపించుకుని అవసరమైన పరీక్షలు, ఇంజక్షన్లు చేయించుకుంటే మంచిదనుకున్నాను. ఈ ప్రస్తావన తేగానే నా భర్తముఖం చిట్లించారు. "నీ మొండితనమే తప్ప మన పరిస్థితేమిటో అర్థం చేసుకోవేం? ఇద్దరం యిప్పుడు పట్నం వెళ్ళి డాక్టరుకు చూపించుకుని పరీక్షలు చేయించుకుని మందులు వాడాలంటే ఎంతవుతుందో తెలుసా? అధమ పక్షం రెండు, మూడొందలు వదులుతాయి. పూట గడవడానికే కష్టంగా వుంటే అవన్నీ జరిగే పనేనా? ముందు నన్ను చెబుతున్న ధోరణిలోనే మొదలు పెట్టారాయన. "పోనీ దగ్గర్లో వున్న హెల్త్ సెంటర్‌కి వెళ్ళి చూపించుకోనా" నా మాటల్ని మధ్యలోనే తుంచేశారాయన.

"ఏం అక్కర్లేదు. వూళ్ళో అందరికీ వెంకాయమ్మ పురుళ్ళు పోస్తుంది. నొప్పులొస్తున్నప్పుడు దానికి కబురెడదాంలే" కటువుగా అన్నారాయన. ఆయన మాటలకు వంత పాడుతున్న అత్తగారు, తోడికోడల్ని చూస్తూంటే కచ్చిగా వుంది.

"అసలు మీ పుట్టింటోళ్ళు సెయ్యాలి పురుడు. మా కర్మ కొద్దీ ఆ మాత్రం కూడా గతిలేని వియ్యాలవారు దొరికారు. అత్తగారి దెప్పుళ్ళు వింటూ మళ్ళీ అగాధంలోకి క్రుంగిపోసాగాను. భయం, అభద్రత, నిరుత్సాహం నన్ను నలిపేయసాగాయి.

ప్రసవ సమయం వచ్చింది. డాక్టరుకు చూపించుకోలేదు. కనీసం వ్యాధి నిరోధక ఇంజక్షన్లు తీసుకోలేదనే దుగ్ధ నన్ను తొలుస్తూనే వుంది. నొప్పులు మొదలవగానే వెంకాయమ్మకు పిలుపు వెళ్ళింది. ఆమె వచ్చిన దగ్గర్నుండి నాకు భరించరాని హింస. జనన మార్గంలో చేతులు పెట్టి కెలుకుతూ, బలవంతంగా ముక్కమని కొప్పడుతూ, నానా రభస, హడావిడి చేసింది. నొప్పుల బాధకంటే ఆమె పెట్టే హింస భరించ శక్యం కాకుండ వున్న సమయంలో బాబు పుట్టాడు.

విపరీతమైన రక్తస్రావమయి ఒళ్ళెరగకుండా పడి వున్న నేను స్పృహలోకి వచ్చి కళ్ళారా నా బాబును చూసుకోకముందే నా బాబుని భయంకరమైన వ్యాధి కబళించసాగింది. నా పిరికితనం, బుద్ధిహీనతల ఫలితంగానే అవసరమైన సమయంలో తెగువ, ధైర్యం చూపలేకపోయాను. శతాబ్దాల బానిస దాస్యం నేనొక అడుగు ముందుకు వేయాలనుకున్నప్పుడల్లా వెనక్కులాగింది. గర్భిణిగా వున్నప్పుడు వ్యాధినిరోధక ఇంజక్షన్లు చేయించుకోవలసిన ప్రాముఖ్యాన్ని, పరిశుభ్రమైన వాతావరణంలో సుశిక్షితులైనవారి పర్యవేక్షణలో ప్రసవించవలసిన అవసరాన్ని గుర్తించలేని నా అజ్ఞానానికి నా బిడ్డ బలయిపోతున్నాడు. నా అపరాధం వెయ్యి తలలై నా కళ్ళ ముందు వికటాట్టహాసం చేస్తోంది. నన్ను నేను క్షమించుకోలేని దశలో బాబూ నన్ను క్షమించు అని వేడుకునే సాహసం చెయ్యలేకపోతున్నాను. నా ఒడిలో అచేతనమవుతున్న పసికందు స్పర్శతో నాచేతన స్తంభిస్తూంది.

—'ఆకాశవాణి',
విశాఖపట్నం
సౌజన్యంతో

## 52 ఏళ్ళ వియోగానంతరం వివాహం!



వియోగం ఎప్పుడూ విషాదం కాదని, తన కలల పంట కోసం ఒక ఆశాజీవి చేసే నిరీక్షణే వియోగమని అమెరికాలోని ఆల్టన్ పట్టణంలో ఒక వృద్ధ ఆశాజీవి రుజువుచేశాడు. 52 సంవత్సరాల వియోగం తర్వాత జోసెఫ్, ఇలిజబెత్ సెస్కిన్‌లు పెళ్ళి చేసుకోవడానికి సిద్ధమయ్యారు. మొదట 1932 లో పెళ్ళి చేసుకున్న వీరు ఆరు సంవత్సరాలు సహజీవనం చేసిన తర్వాత విడిపోయారు. అప్పుడు వారికి ఇద్దరు పిల్లలు కూడా వున్నారు. "మాది ఇప్పటికీ యువ రక్తమే" అని సెస్కిన్ ఎంతో ఉత్సాహంగా చెప్పింది. తమ సహజీవనానికి వయస్సు ఒక సమస్య కాదని, జీవన మాధుర్యాన్ని జుర్రుకోవడానికి ఇంకా ఎంతో కాలం వుందని వారు అంటున్నారు. ఇప్పుడు వారి వయస్సు 77 సంవత్సరాలు. తన తండ్రి 78 సంవత్సరాల వయస్సులో పెళ్ళి చేసుకుని 105 సంవత్సరాలు బ్రతికాడని జోసెఫ్ తెలిపాడు.

నందం రెడ్డియ్య,
భట్టిప్రోలు



## ఆకర్షణ సహజం

'తృష్ణగ్ని' సినిమా వల్ల నానా పాటేకర్, పల్లవీ జోషీల మధ్య రొమాన్స్ సాగిందని సాగుతున్న ప్రచారాన్ని పల్లవీ జోషీ దృష్టికి తీసుకు వచ్చినప్పుడు తృష్ణగ్ని సినిమాలో ఏకైక మహిళా ఆర్టిస్టును తానే కావడం వల్ల నానా పాటేకర్‌ను నేను ఆకర్షించి వుండవచ్చు.

అందులో అసాధ్యమైనదేం లేదు. మేము కూడా మనుషులమే అందరి మాదిరిగానే. తారల మధ్య కూడా ఆకర్షణ వుంటుందని, అందులో తప్పు లేదని పల్లవీ జోషి అంది.

- ఎస్.



## కిమీ ప్రత్యేకత

కిమీకాట్కార్‌పై సినీ రంగంలో రకరకాల పుకార్లు వ్యాపిస్తాయి. అయితే ఇందులో కొన్ని వాస్తవాలు కూడా వుంటాయి. కిమీకాట్కార్ ప్రతి ఆరు నెలలకు తన ప్రియుణ్ణి మారుస్తుందని, పండుగనాడు కూడా పాత మొగుడేనా అన్నట్టు ప్రియులను మార్చందే ఆమె వుండలేదని అంటారు.

మోహనిష్ బహల్, హేమంత్ బిరజ్, జాకీ ష్రాఫ్, సంజయ్‌దత్, డానీ, చినేజ్ అలీల తర్వాత ఇప్పుడు కొత్త ప్రియుని కోసం ఎదురు చూస్తుందని సినీ రంగంలో ఓ పుకారు. మరి ఇది ఎంతవరకు నిజమో కిమీకే తెలియాలి.

- ఎస్.